# యువత ఓట్లే కీలకం




**యువతపై ప్రత్యేక దృష్టి సారించిన అన్ని రాజకీయ పార్టీలు**

**నిర్ణయాత్మక పాత్రను పోషించనున్న మహిళలు**

**ఇప్పటికే ఎన్నికల ఇన్‌చార్జిలను నియమించిన బీఆర్ఎస్**

మెదక్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో యువత ఓట్లు కీలకం కానున్నాయి. ఈ ఎన్నికల్లో అభ్యర్థుల భవిత వారిపైనే ఆధారపడి ఉన్నదని చెప్పవచ్చు. దీంతో కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్న వారి నుంచి 39 ఏండ్లలోపు ఉన్న వారిపై అభ్యర్థులు ప్రత్యేక దృష్టిపెట్టారు. మెదక్ జిల్లాలో యువ ఓటర్ల సంఖ్య అత్యధికంగా ఉంది. ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం ఓటరు 4,34,275 మంది ఉండగా, 18 నుంచి 40 ఏండ్లలోపు వారే 2,24,228 మంది ఉన్నారు. వీరే రాజకీయ నేతల తలరాతను తిరగ రాయనున్నారు. మరో వైపు, మహిళలు సైతం నిర్ణయాత్మక పాత్ర పోషించనున్నారు. జిల్లాలో పురుష ఓటర్లు 2,09,927 ఉంటే, మహిళా ఓటర్లు 2,24,337 ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయా పార్టీలు యువతతోపాటు మహిళలను ప్రసన్నం చేసుకోవడంపై దృష్టి సారించాయి. కీలకమైన మహిళలు, యువకుల మద్దతు తమకే అంటూ అన్ని పార్టీలు చెప్పుకుంటున్నా, బీఆర్ఎస్ అందరి కంటె ముందున్నది. మరోవైపు, జిల్లాలో 90–99 ఏండ్ల వృద్ధ ఓటర్లు 508 మంది ఉండగా, 100–109 ఏండ్ల వారు 21మంది ఉన్నారు. 120 ఏండ్లకు పైబడిన 8 మంది ఈ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.

### జిల్లావ్యాప్తంగా 4,34,275 మంది ఓటర్లు..

మెదక్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం తుది జాబితా విడుదల చేసింది. ఇందులో మెదక్‌లో మొత్తం 4,34,275 ఓటర్లు ఉన్నారు. పురుషులు 2,09,927 మంది, స్త్రీలు 2,24,337 మంది ఉన్నారు. ఎన్ఆర్ఐ ఓటర్లు 9 మంది ఉండగా, సర్వీస్ ఓటర్లు 124 మంది ఉన్నారు. కొత్త ఓటర్లు ఓటుహక్కు నమోదుకు ఈ నెల 31 వరకు ఎన్నికల సంఘం గడువు విధించింది. నామినేషన్ల స్వీకరణకు పది రోజుల ముందు వరకు ఓటర్లు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

### యువత ఓటర్లే కీలకం..

మెదక్ జిల్లా వ్యాప్తంగా మెదక్, నర్సాపూర్ నియోజకవర్గ యువ ఓటర్లు కీలకం కానున్నారు. 18–19 ఏండ్ల వయస్సు గల ఓటర్లు 15,596 మంది, 20–29 ఏండ్ల వారు 94,163, 30–39 ఏండ్ల వారు 1,14,469, 40–49 ఏండ్ల వారు 94,354, 50–59 ఏండ్ల వారు 58,589, 60–69 ఏండ్ల వారు 36,324, 70–79 ఏండ్ల వారు 16,629, 80–89 ఏండ్ల వారు 3,614 మంది, 90–99 ఏండ్ల వారు 508, 100–109 ఏండ్ల వయస్సు వారు 21 మంది, 120 ఏండ్ల పైబడిన ఓటర్లు 8 మంది ఉన్నారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 4,34,275 ఓటర్లు ఉన్నారు.

**వయస్సు వారీగా యువ ఓటర్ల వివరాలు**

| నియోజకవర్గం | 18–29 | 20–29 | 30–39 |
|---|---|---|---|
| మెదక్ | 7878 | 44,567 | 53,419 |
| నర్సాపూర్ | 7718 | 49,596 | 61,050 |

### ప్రచారంలో బీఆర్ఎస్ ముందంజ..

బీఆర్ఎస్ అధిష్ఠానం అభ్యర్థులను ఖరారు చేయడంతో ప్రచారంలో దూసుకెళ్తున్నది. మెదక్‌లో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి రెండు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి, హ్యాట్రిక్ దిశగా వ్యూహాలు రచిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీల అభ్యర్థులను ఆయా పార్టీల అధిష్ఠానాలు ఇంకా ప్రకటించలేదు. దీంతో బీఆర్ఎస్ ప్రచారంలో ముందుండగా, ఆ రెండు పార్టీలు వెనకబడి ఉన్నాయి.

# యువత, మహిళా ఓటర్లు ప్రధానం

**పార్టీలతోపాటు ఎన్నికల సంఘం ప్రధాన దృష్టి**

**యువత ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక బూత్‌లు**

**మహిళల కోసం ఐదు మహిళా పోలింగ్ కేంద్రాలు**




సంగారెడ్డి, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి జిల్లాలో యువత, మహిళల ఓట్లు కీలకం కానున్నాయి. ఎమ్మెల్యే అభ్యర్థులు జయాపజయాలను నిర్ణయించేస్థాయిలో యువత, మహిళా ఓటర్లు ఉన్నారు. దీంతో అన్ని రాజకీయపార్టీల దృష్టి యువత, మహిళా ఓటర్లను తమవైపు ఎలా తిప్పుకోవాలని కసరత్తు చేస్తున్నారు. రాజకీయపార్టీలతోపాటు ఎన్నికల కమిషన్ సైతం యువత, మహిళా ఓటర్ల శాతం పెంచటంపై దృష్టి సారించింది. సాధారణ ఎన్నికల్లో యువత, మహిళా ఓటర్లు ఎక్కువ శాతం ఓటింగ్‌లో పాల్గొనేలా ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తున్నది.

### కీలకంగా మహిళా ఓటర్లు

రానున్న సాధారణ ఎన్నికల్లో సంగారెడ్డి జిల్లాలో యువత, మహిళా ఓటర్లు కీలక భూమిక పోషించనున్నారు. దీంతో రాజకీయపార్టీలు యువ, మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. సంగారెడ్డి జిల్లాలో 13,55,958 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 6,72,757 మంది మహిళా ఓటర్లు ఉండగా, పురుష ఓటర్లు 6,83,076 మంది ఉన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో 1,20,037 మంది మహిళా ఓటర్లు, నారాయణఖేడ్‌లో 1,12,654, అందోల్‌లో 1,4,133, జహీరాబాద్‌లో 1,31,419, పటాన్‌చెరులో 1,84,514 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. సంగారెడ్డి, అందోలు నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. అందోలు నియోజకవర్గంలో పురుష ఓటర్లు 1,20,572 మంది ఉండగా, మహిళా ఓటర్లు 1,24,133 మంది ఉన్నారు. పురుషల కంటే మహిళా ఓటర్లు 3561 మంది ఎక్కువగా ఉన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో పురుష ఓటర్లు 1,18,265 మంది ఉండగా, మహిళా ఓటర్లు 1,20,37 ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 1772 మంది ఎక్కువగా ఉన్నారు. సంగారెడ్డి, అందోలు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు పైచేయి ఉన్నారు. మిగతా నియోజకవర్గాల్లో సైతం మహిళలు ఎక్కువ మంది ఏ పార్టీ వైపు మొగ్గుచూపితే వారు గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో రాజకీయ పార్టీలు మహిళా ఓటర్లపై ప్రధానంగా దృష్టి సారించాయి.

### యువ ఓటర్లపై దృష్టి

సంగారెడ్డి జిల్లాలోని యువ ఓటర్లపై అందరి దృష్టి నెలకొన్నది. సంగారెడ్డి జిల్లాలో 3,37,970 యువ ఓటర్లు ఉన్నారు. 18 నుంచి 19 ఏండ్ల వయస్సు ఉన్న ఓటర్లు 43,684 మంది ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 25321 మంది ఉండగా, మహిళా ఓటర్లు 18,353 మంది ఉన్నారు. 20 నుంచి 29 ఏండ్ల వయస్సు ఉన్న ఓటర్లు 2,94,286 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 1,50,350, మహిళలు 1,43,872 మంది ఉన్నారు. జిల్లాలో మొత్తం 3,37,970 మంది యువ ఓటర్లు ఉన్నారు. సంగారెడ్డి, పటాన్‌చెరు నియోకవర్గాల్లో ఎక్కువగా యువ ఓటర్లు ఉన్నారు. యువ ఓటర్లను తమవైపు ఎలా తిప్పుకోవాలని ఇప్పటి నుంచే రాజకీయ పార్టీలు కసరత్తు చేస్తున్నాయి.

### యువతకు ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రం

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో యువ ఓటర్లు ఓటింగ్ చేసేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటున్నది. ఇందుకోసం నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నది. ఇటీవల ఎన్నికలు జరిగిన కర్ణాటక రాష్ట్రంలో యువ ఓటర్లను ఆకర్శించేందుకు ఎన్నికల కమిషన్ యువ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. యువ పోలింగ్ కేంద్రాల ప్రయోగం విజయవంతం కావడంతో అదే తరహాలో సంగారెడ్డి జిల్లాలో సైతం ఎన్నికల కమిషన్ యువ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నది. సంగారెడ్డి, జహీరాబాద్, అందోలు, నారాయణఖేడ్, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో ఒక్కో యువ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను రిటర్నింగ్ అధికారులను ఎన్నికల కమిషన్‌కు పంపించారు. యువ పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ అధికారులు, సిబ్బంది అందరూ యువకులు ఉంటారు. పోలీసు సిబ్బంది సైతం యువకులు ఉంటారు. యువ ఓటర్లను ఆకర్శించేలా యువ పోలింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ తీర్చిదిద్దనున్నది. కాగా, మహిళా ఓటర్ల కోసం ప్రతి నియోజకవర్గంలో ఒక మహిళా పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేయనున్నది.



# మనోహరాబాద్ నుంచి పది వేల మెజార్టీ రావాలి

**○ కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలి ○ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**

మనోహరాబాద్, అక్టోబర్ 14: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని, అనేక పథకాలను ప్రవేశపెట్టి నిరుపేదలకు అందజేశారని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మనోహరాబాద్‌లో రాష్ట్ర నాయకుడు ర్యాకల శేఖర్‌గౌడ్, ముఖ్య నాయకులతో కలిసి శనివారం బూత్ లెవల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గడిచిన పదేండ్లలో తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకెళ్లిందన్నారు. మూడోసారి గజ్వేల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కేసీఆర్‌కు మనోహరాబాద్ మండలం నుంచి పది వేల మెజార్టీ ఇవ్వాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలే పార్టీకి బలమని, ఉద్యమం సమయం నుంచి పార్టీతో నడుస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న నాయకులకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కలిసి కట్టుగా పని చేసి వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీ తీసుకురావాలన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రజా సమస్యలు పట్టవని, ఇప్పటికీ టిక్కెట్ల కోసం కొట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. వారికి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవన్నారు. భారీ మెజార్టీ లక్ష్యంగా బూత్‌లెవల్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, మెజార్టీలో మొదటి స్థానంలో నిలిపిన బూత్ కమిటీలకు మొదటి, రెండో, మూడో స్థానాలుగా గుర్తించి నగదు బహుమతిని తన సొంతంగా అందజేస్తానని ప్రకటించారు. సమస్యలు ఏమి ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పార్టీ మండలాధ్యక్షుడు అందుబాటులో ఉండి ప్రతిరోజు బూత్‌లెవల్ కమిటీలకు దిశానిర్దేశం చేయాలన్నారు. ఎన్నికల అనంతరం 5 వేల మందికి గృహలక్ష్మి పథకాన్ని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పురం మహేశ్ ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, రైతుబంధు మండల కో–ఆర్డినేటర్ యాంజాల సుధాకర్‌రెడ్డి, సీఎం కేసీఆర్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్కుల మహిపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు చంద్రశేఖర్ ముదిరాజ్, కుమ్మరి సంఘం మండల అధ్యక్షుడు దశరథ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జావీద్‌పాషా, మాజీ ఎంపీటీసీ కృష్ణాగౌడ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బూత్ లెవల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి